# క్రీడలతో స్నేహ భావం పెంపొందుతోంది

● రాష్ట్ర పర్యాటక, అబ్కారి శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్

**అచ్చంపేట, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహ భావం పెరిగి మానవ సంబంధాలు పెంపొందుతాయని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో జీబీఆర్ ఆలిండియా లెవల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు క్రీడా కార్యక్రమానికి క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఫైనల్ విజేత ఆర్వ న్‌సీసీ జట్టుకు బహుమతులను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ప్రభుత్వ విఫ్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజును గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక శారీరక ధృడత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, క్రీడాకారులు ఓటమని, గెలుపును సమానంగా స్వీకరించాలన్నారు. ఓటమి గెలుపుకు నాంది అని, ఓటమితో దిగులు చెందకుండా గెలుపు దిశగా ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు ఉన్నారు.



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్




మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## సాగు రైతుకే పోడు భూములపై హక్కు..

-రుణమాఫీ సంగతేమిటి? -ప్రభుత్వ హామీలు నేరవేరెదెన్నడు

-బీసీ కమీషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి



ధర్న కార్యక్రమంలో మాట్లాడుతున్న బీసీ కమీషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** వందల సంవత్సరాల నుంచి భూమినే నమ్ముకొని సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్న అడవి బిడ్డల కడుపు కొట్టి పోడు భూములను ప్రభుత్వం ఆక్రమించుకోవాలని చూస్తూ రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదని బీసీ కమీషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతు ధర్న కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ధర్న కార్యక్రమానికి బీసీ కమీషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్‌రెడ్డిలు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచి రైతులకు పెద్ధపీట వేస్తామని ప్రగల్భాలు పలుకడమే తప్ప రైతులకు చేసిందేమి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నేరవేర్చి రైతులకు, ప్రజలకు అండగా ఉంటాని వారు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులను గుప్పిట్లో పెట్టుకొని పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులపై లాఠీ చార్జీలు చేయించడమేమిటని వారు ప్రశ్నించారు. దున్నేవాడిదే భూమి అని, దళితులకు మూడుఎకరాల భూమిని కల్పించి అభివృద్ధి పరుస్తామన్న మాటలు నీటి మూటలుగానే మిగిలినప్పటికి ఆదివాసులపై లాఠీ జులుం చేయించడం ప్రజాస్వామ్యా అని వారు ప్రశ్నించారు. రెండు పర్యాయాలుగా టీఆర్ఎస్ ప్రభుత్వం పాలన కొనసాగిస్తున్నప్పటికి ఏక కాలంలో రుణమాఫీ చేస్తామని కాలం గడుస్తున్నప్పటి కూడా రుణమాఫీపై స్పష్టత ఇవ్వకుండా రైతులను ఊగిసలాటలోనెట్టుస్తున్నారని వారు విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం మాయమాటలతో ప్రజలను మభ్య పరుస్తున్నారే తప్ప ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నేరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని వారు దుయ్యబట్టారు. ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి రైతులను కార్యాలయాల చుట్టు తిరిగేలా చేస్తూ కాల యాపన చేస్తున్నారే తప్ప రైతు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడానికి మాత్రం వీలు లేకుండా ధరణి వెబ్‌సైట్‌ను మార్చారని వారు పేర్కొన్నారు. ధరణితో సంపన్నులకే లాభం చేకూరుతుంది కానీ సన్న, చిన్న కారు రైతులకు తీరని అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 100ల ఎకరాలు ఉన్న గుత్తేదారులకు మాత్రం ధరణితో అధిక లాభం ఉంటే...2,3 ఎకరాలు ఉన్న రైతుల పేరిట ఉన్న భూమి ఆన్‌లైన్ కనిపించకపోవడం వల్ల ఆ భూమి మా పేరిట కల్పించాలని కార్యాలయాల చుట్టు తిరిగి అధికారులకు మొర పెట్టుకున్న ఏండ్లు గడిచిన కూడా రైతుల భూ సమస్యల పరిష్కారం కాకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్న విషయం ప్రభుత్వానికి కనిపించడం లేదా అని వారు ప్రశ్నించారు. రైతు సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాధవి, దిలీప్‌చారి, సుబ్బారెడ్డి, నరేందర్‌రావు, రామకృష్ణరెడ్డి, రాజవర్ధన్‌ఱెడ్డి, నాగరాజు, శ్యాంసుందర్, రమణరెడ్డి, జాకీర్ ఉస్సేన్, జానకి పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

## రూ.2లక్షల ఎల్‌ఓసీ అందజేసిన మంత్రి



**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన అంతిరెడ్డి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.2లక్షల ఎల్‌ఓసీని హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో లబ్దిదారులకు అందజేసి, భవన నిర్మాణ కార్మికుల సంఘం క్యాలెండర్ ను రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్ కెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు అశోక్, ఉపాధ్యక్షులు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## మన ఊరు- మన బడి పనుల పరిశీలన



పాఠశాలను పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ మనుచౌదరి

**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయి సదుపాయాలతో స్పష్టమైన మార్పును సంతరించుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగలవారం నాగర్‌కర్నూల్ పట్టణ పరిధిలోని సంజయ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో రూ.19లక్షల 67వేల నిధులతో చేపడుతున్న మన ఊరు-మన బడి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మన ఊరు - మన బడి కార్యక్రమంల పనులు పూర్తి చేసి జనవరి 6వ తేదీకి ప్రారంభించేందుకు పాఠశాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాల కమిటీకే పనుల బాధ్యతలు అప్పగించినందన, ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుకోవాలని హితవు పలికారు. పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. జిల్లాలో ఎంపిక చేసిన 40 పాఠశాలలను జనవరి 6వ తేదీ వరకు మండలానికి రెండు పాఠశాలల చొప్పున ప్రారంభం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతకు ముందు మండల విద్యాధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి పాఠశాలల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, ఏఈ ప్రశాంత్, వెంకటేశ్వర శెట్టి తదితరులు ఉన్నారు.

## రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదులో వనపర్తి జిల్లా మొదటిస్థానంలో నిలిచింది

**వనపర్తి టౌన్,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా రాష్ట్ర గవర్నర్ డా.తమిళసై సౌందర రాజన్ అందించిన సేవా సథకం, మెమొంటోలను జిల్లా రెడ్ క్రాస్ సభ్యులు జిల్లా ఎస్పీ అపూర్వ రావుకు అందజేసినట్లు జిల్లా రెడ్ క్రాస్ చైర్మెన్ ఖాజా కుతుబ్దీన్ తెలిపారు. మంగళవారం జిల్లా ఎస్పీ చాంబర్ లో జిల్లా రెడ్ క్రాస్ చైర్మెన్ ఖాజా కుతుబుద్దీన్, జిల్లా రెడ్ క్రాస్ కార్యవర్గ సభ్యులు జిల్లా ఎస్పీ ని ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేసినట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 3 సంవత్సరాలుగా రక్తదాన శిభిరాలు విజయవంతం కావడానికి కృసి చేసిన జిల్లా ఎఈస్ప, అదనపు ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్ లను ఆయన కొనియాడారు. రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదులో వనపర్తి జిల్లా 2021-22 సంవత్సరంలో మొదటిస్థానంలో నిలిచిందని, సభ్యత్వ నమోదుకు సహకరించాలని ఆయన జిల్లా ఎస్పీని కోరారు. రెడ్ క్రాస్ సంస్థ ద్వారా జిల్లాకు 4బంగారు పథకాలు, సేవా పథకాలు రావడం పై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ వస్ చైర్మెన్ సయ్యద్ కలాం పాషా, జిల్లా కార్యదర్శి చీర్ల కృష్ణసాగర్, పాలకవర్గ సభ్యులు డా.మురళీధర్, జేఎం మిషేక్, గోనూరు యాదగిరి, అహ్మద్ బీన్ ఒమర్, రెడ్‌క్రాస్ వాలంటీర్ మహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు అండగా తెలంగాణ ప్రభుత్వం

**దేశం అంతా రైతు బంధు, రైతు భీమా అమలు కావాలి**

**బీఆర్ఎస్ ప్రకటనతో బీజేపీలో వణుకు**

**తెలంగాణ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెడుతున్న కేంద్రం**

**తెలంగాణ పల్లెపల్లెన ప్రగతి జాడలు**

**రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**రూ.1కోటి50లక్షల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి



పత్తి రైతు కూలీలతో మాట్లాడుతున్న మంత్రి నిరంజన్ రెడ్డి

**ఖిల్లాఘణపురం,డిసెంబర్27 ప్రభాతవార్త:** మండల పరిధిలో మంగళ వారంపలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మండల పరిధిలోని రోడ్డుమీది తాండాలో ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుండి గ్రామ పంచాయితీ భవనం నిర్మాణం నిమిత్తం రూ.20లక్షలు మంజూరు కావడంతో శంకుస్థాపన, సల్కలాపూర్ గ్రామంలో సీపీపీ నిధుల నుండి రూ.6లక్షల 40వేలతో నిర్మించిన బస్సు షెల్టర్ ప్రారంభోత్సవం, పర్వతాపూర్ గ్రామంలో ఎస్‌బీఎఫ్ నిధుల నుండి దేవాలయం ప్రాంగణంలో రూ.10లక్షలతో నిర్మించిన కామన్ కమ్యూనిటీ హాల్ ప్రారంభం, వెంకటంపల్లి ఎన్ఆర్‌జీఎస్ నిధుల నుండి గ్రామ పంచాయితీ భవన నిర్మానానికి శంకుసాంథపన, గట్టుకాడిపల్లి లో సీబీఎఫ్ నిధులతో రూ.10లక్షల తో కళ్యాణమండపానికి భూమి పూజ, దొంతికుంట తాండాలో నూతన గ్రామపంచాయితీ నిర్మాణానికి ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.20లక్షలు, కుంటముందరి తాండాలో ఎస్టీ కామన్ కమ్యూనిటీ హాల్ కు రూ.5లక్షల సీబీఎఫ్ నిధులతో శంకుస్థాపన, సోళీపూర్ నూతన గ్రామ పంచాయితీ భవన నిర్మాణానికి రూ.20లక్షల ఎన్ఆర్‌జీఎస్ నిధులతో శంకుస్థాపన హెల్త్ సబ్ సెంటర్ నిమిత్తం రూ.24లక్షల వైద్య ఆరోగ్య శాఖనిధులతో శంకుస్థాపన పలు అభివృద్ధి పనులకు రూ.1కోటి50లక్షల40వేల నిధులతో అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అండగా నిలుస్తున్నది తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనని అన్నారు. రాబోయే రోజుల్లో దేశంలోని రైతన్నలకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన పిలుపునిచ్చారు. రైతుల కష్టాలు తీరాలంటే కేసీఆర్ వ్యవసాయ అనుకూల విధానాలు దేశం అంతా అమలు కావాలని అన్నారు. తెలంగాణలో ప్రవేశపెడుతున్న రైతు సంక్షేమ పథకాలపై దేశంలో చర్చ మొదలైందని తెలిపారు సీఎం కేసీఆర్ బీఆర్ఎస్‌పార్టీ ప్రకటనతో బీజేపీ పార్టీలో వణుకు మొదలైందని తెలిపారు. రైతుల ఖాతాల్లో నేటి వరకు రైతు బంధు కింద నేరుగా 9విడతల్లో రూ.58వేలకోట్ల జమ చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రంగా అభివర్ణించారు. రేపటి నుండి 10వ విడత రైతుబంధు పథకం కింద మరో రూ.7వేల600 కోట్లు 66లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో రైతు రుణమాఫీ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. దేశం మొత్తం మీద రైతు బంధు, రైతు భీమా పథకాలు అమలు కావాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. పంట సాగుకు రైతులకు ఉచిత కరెంటు సాగు నీళ్లను అందజేస్తూ రైతుల అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉందని అన్నారు. రైతులకు భరోసా ఇవ్వలేని ప్రభుత్వ పాలన ఎందుకని ప్రశ్నించారు. అన్నంపెట్టే అన్నదాతకు చాలా రోజుల నుండి అవస్థలు పడుతున్న నేపథ్యంలో సీఎం కేసీఆర్ పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. దేశంలో జై జవాన్ జై కిసాన్ అనే పదాలు నినాదాలకే పరిమితమయ్యాయని అన్నారు. కరోనా నేపథ్యంలో రాష్ట్రంలో ఆదాయ వనరులు తగ్గడంతో తెలంగాణ కు న్యాయంగా రావాల్సిన నిధులు ఇవ్వకుండా కేంద్రం అడ్డుకుంటుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వాన్ని శతవిధాల కేంద్రంలోనీ బీజేపీ పార్టీ ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నిస్తుందని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బందుల పాలు చేస్తున్న తెలంగాణ ప్రగతిని మాత్రం అడ్డుకోలేరని అన్నారు. తెలంగాణ అభివృద్ధి దేశానికి ఒక నమూనాగా నిలుస్తుందని వివరించారు. నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ పలుస రమేష్ గౌడ్ కు మండల ప్రజా ప్రతినిధులు శాలువా పూలమాలతో సత్కరించారు. దొంతికుంట తాండా,కుంటముందరి తాండ,రోడ్డుమీది తాండాలలో మంత్రి నిరంజన్ రెడ్డి వృద్ధ గిరిజన మహిళలను పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డి పల్లి గ్రామశివారులో పత్తి చేనులో పత్తి ఏరుతున్న రైతు కూలీలతో మంత్రి సరదాగా ముచ్చటించి పత్తి చేనులో పత్తి తీసి మురిసి పోయారు. పత్తి రైతుతో మాట్లాడుతో పత్తి పంటలో వస్తున్న దిగుబడి గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణా నాయక్, జడ్పీటీసీ సామ్యా నాయక్, పీఎసీఎస్ చైర్మెన్ మురళీధర్‌రెడ్డి, మాజీ వనపర్తి వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ లక్ష్మారెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మెన్ బాలీశ్వర్ రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షులురాళ్ల కృష్ణయ్య,పీఏసీఎస్ వైస్‌చైర్మెన్ క్యామరాజు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సత్యనారాయణ, శ్యాం సుందర్‌రెడ్డి,టీఆర్ఎస్‌కెవి జిల్లాఅధ్యక్షులు విక్రం,సర్పంచులు వెంకట రమణ,శాంతమ్మ,గిరిమ్మవెంకటేష్, నిర్మలాసుదర్శనాచారి, అరుణాదేవి సురేందర్, దేవేందర్,పద్మ శ్రీ బాలీశ్వర్‌రెడ్డి, పీనా నాయక్,శేషయ్య, సతీష్,మోహన్ జీ, నరేష్ నాయక్, శ్రీను నాయక్, బాలస్వామి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సత్ప్రవర్తనతో మెలిగే వారికి పోలీస్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది

**డీఎస్పీ సత్యనారాయణ**

**హిస్టరీ షీట్‌మేళా నిర్వహించిన డీఎస్పీ**



మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 27 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో జిల్లాలో గతంలో పలు నేరాలకు పాల్పడిన కేసులలో ఉన్న రౌడీషీట్స్, సస్పెక్ట్ షీట్స్ ఓపెన్ అయిన వారికి డీఎస్పీ సత్యనారాయణ హిస్టరీ షీటర్స్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ రౌడీషీటర్లు చేసిన నేరాలపై కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్లు ఇకముందు చట్ట వ్యతిరేక సంఘటనలకు పాల్పడితే పిడి యాక్ట్ కేసులను పెడతామని హెచ్చరించారు. ప్రతి ఒక్క రౌడీషీటర్ వారి వివరాలు,కుటుంబాల వివరాలు స్నేహితుల వివరాలు, చేసిన నేరాల వివరాలు, వారు చేసిన చివరినేరం, ప్రస్తుతం వారి జీవన విధానం గురించి అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లుగా నమోదైన వారు చట్టాన్ని చేతిలోకి తీసుకుని తిరిగి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. రౌడీషీటర్లపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, భూకబ్జాలు సెటిల్మెంట్లలో తలదూర్చిన, అల్లర్లకు పాల్పడిన, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన, చట్ట ప్రకారం హిస్టరీ షీటర్స్ మళ్లీ ఓపెన్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లా పరిధిలో ఇప్పటివరకు 65 మంది రౌడీషీటర్లు, 190 మంది సస్పెక్ట్స్, ఒకరిపై కేడీ, కమ్యూనల్ సస్పెక్స్ 39, పాత నేరస్తులు 130 హిస్టరీ షీట్స్ మెయింటెన్ చేస్తున్నామన్నారు. మొత్తం 438 మందిలో 71 మందిని తొలగించడం జరుగుతుందని తెలిపారు. ఎటువంటి గొడవలు సృష్టించడం గాని, వేరే వ్యక్తులను రెచ్చగొట్టడం వంటివి చేయకూడదని శాంతి భద్రతలకు, ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగేలాగా ప్రవర్తించకూడదని శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడేది లేదని, గొడవలు, అల్లర్లు, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే ఎలాంటి వారినైనా ఉపేక్షించేది లేదని చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారిపై హిస్టరీ షీట్స్ మళ్లీ ఓపెన్ చేయడం జరుగుతుందని, నేరస్తుల కదలికలపై పూర్తి నిఘా పెంచడం జరుగుతుందన్నారు. సాధారణ ప్రజలలగా రౌడీ షీటర్లకు వారి కదలికలపై, కార్యకలాపాలపై పూర్తి స్వేచ్ఛ ఉండదని, చట్ట ప్రకారంగా వారి కదలికలపై కొన్ని పరిమితులు ఉంటాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని, శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, తీవ్రతరమైన నేరాలకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించేది లేదని అన్నారు. ప్రజల భద్రత, శాంతియుత వాతావరణం నెలకొల్పి, నేరాల నియంత్రణే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. సివిల్ పంచాయతీలలో, భూ పంచాయతీల విషయాలలో కలుగచేసుకుని బెదిరింపులకు పాల్పడడాలు,ఎక్కడైనా నేరాలకుపాల్పడిన, మహిళలపై వేధింపులు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడంతో పాటు శాంతి భద్రతలకువిఘాతం కలిగిస్తే సహించేది లేదని, అలంటి వారిపై పిడి యాక్ట్ ప్రయోగిస్తామని తెలిపారు.సత్ప్రవర్తన, వివిధ కారణాలలో 71 మందిపై ఉన్న హిస్టరీ షీట్స్ క్లోజ్ నిర్వహించిన హిస్టరీ షీట్ మేళలో చాలా ఏళ్లక్రితం రౌడీషీట్స్,సస్పెక్ట్ షీట్స్,కమ్యూనల్ సస్పెక్ట్స్ ఓపెన్ అయి వారి ప్రవర్తన, వ్యవహార శైలి గమ నించిన అనంతరం ఎవరి పని వారు చేసుకుంటూ ప్రశాంతంగా జీవిం చాలని, ముందు ముందు వీరిపై కూడా పోలీస్ నిఘా ఉంచడం జరు గుతుందని, ప్రశాంతంగాబతకాలని,అలాంటి వారికి పోలీస్ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భవిష్యత్తులో కూడాఎలాంటి గొడవలకు వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలోసిఐలు శ్రీకాంత్‌రెడ్డి,సీతయ్య,జనార్దన్, ఆర్ఐ కృష్ణయ్య, ఎస్సైలుజగదీశ్వర్, సురేష్,పర్వతాలు,సతీష్,నరెందర్,అశోక్‌బాబు,శ్రీనివాసులు, విక్రమ్, రమేష్, శ్రీనివాసరావు, సునిత,డిసిఆర్బీ, ఐటి సిబ్బంది పాల్గొన్నారు.

# ఫీల్డ్ వెరిఫికేషన్ రిపోర్టు ఇవ్వాలి

**జిల్లా కలెక్టర్ వల్లూరుక్రాంతి**



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 27 ప్రభాతవార్త :** టిఎం 33, ధరణి సమస్యలపై పెండింగ్‌లో ఉన్న వాటిని ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి రిపోర్టు ఇవ్వాలని, గట్టు భూసేకరణ, ఆర్అండ్ఆర్ సెంటర్ల పెండింగ్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తహసిల్దార్లను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ చాంబర్‌లో ఆయా మండలాల తహసిల్దార్లతో గట్టు భూసేకరణ, ఆర్ఆర్ సెంటర్ల పెండింగ్ పనులు, పునరావాస కేంద్రాల పనులపై తహసిల్దార్‌లు,నీటి పారుదలశాఖ, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. భూసేకరణకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గట్టు ఎత్తిపోతల పథకం కింద పెండింగ్ ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని, రేవులపల్లి, చిన్నోనిపల్లి, నాగర్‌దొడ్డి, గార్లపాడు,ఆలూరు,ర్యాలంపాడు పునరావాస కేంద్రాల పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేస్తూ నివేదికలు పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భారత్‌మాల కార్యక్రమంలోభాగంగా మండలాలలో గల భూములకు సంబంధించిన సమస్యలు, వివాదంలో ఉన్నభూ సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలన్నారు. గట్టు, అయిజ, ఉండవెల్లి, ఇటిక్యాల, రాజోలి, కెటిదొడ్డి మండలాలో టిఎం 33, ధరణిలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు టీంలను పంపించి ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి సర్వే పనులుపూర్తిచేసి రిపోర్ట్సు సబ్మిట్ చేయాలని తహసిల్దార్‌లను ఆదేశించారు. వారంలోపు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు సంబంధించి పెండింగ్ దరఖాస్తులు తహసిల్దార్‌లు, ఆర్ఐలు తనిఖీ చేసి పరిష్కరించాలన్నారు. మండలం వారిగా వివరాలుఅడిగి తెలుసుకున్నారు.సమావేశంలో ఆర్డీఓ రాములు, అన్ని మండలాల తహసిల్దార్లు, ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకిచ్చిన హామీల అమలు ఏదీ

**నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు విష్ణు**



**మల్దకల్, డిసెంబరు 27 ప్రభాతవార్త:** గత ఎన్నికలప్పుడు ఓట్లు వేయించుకునే అవసరం ఉన్నప్పుడు మా మండల ప్రజలకు ఇచ్చినటువంటి హామీల అమలు ఏమైందని, మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మిస్తామని, చర్చి కడతామని ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని మంగళవారం విలేఖరుల సమావేశంలో మండల అధ్యక్షుడు విష్ణు, జిల్లా కార్యదర్శి లవన్నలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర, ప్రభుత్వం ఏర్పడి 9 సంవత్సరాలు కావస్తున్నా ఈనాటికీ మండల కేంద్రం నుంచి ఆయా గ్రామాలకు వెళ్లే రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని అన్నారు. దాసరిపల్లి,ఉలిగేపల్లిలకు రోడ్లు వేస్తామని ఇచ్చిన హామీలు అలాగే నిలిచిపోయాయని నాగర్‌దొడ్డిలో చర్చి నిర్మిస్తామన్న హామీ కూడా అసంపూర్తిగా ఉందని అన్నారు. అదేవిధంగా గార్లపాడులో 70 మంది విద్యార్థులు ఉన్నా కేవలం ఒకే ఉపాధ్యాయుడితో నెట్టుకొస్తున్న పరిస్థితి ఉందని ఆయా గ్రామాలలో, పాఠశాలలో పూర్తి సౌకర్యాలు లేవని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి లవన్న, మండల అధ్యక్షుడు విష్ణుతోపాటు ఉపాధ్యక్షులు ప్రేమ్‌రాజ్, నజుముల్లా, ప్రధాన కార్యదర్శి తిమ్మప్ప, మండల కోశాధికారి ఉప్పరి కృష్ణ, సోషల్ మీడియా ఇంఛార్జి శేషంపల్లి ఆంజనేయులు, గోపాల్, హనుమేష్, లక్ష్మన్న, గార్లపాడు లక్ష్మన్న, దాసరిపల్లె సర్వేశ్, దాసరిపల్లె రమేష్, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రసవం కోసం వెళితే ప్రాణాలు పోయాయి!

-తల్లికుమార్తెల మృతి -వైద్యుల నిర్లక్ష్యమే కారణమా?







మృతి చెందిన స్వర్ణ



**అచ్చంపేట, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** పురుటి నొప్పులతో ప్రసవ వేదన అనుభవిస్తూ మరో జీవికి జన్మనిస్తున్న నిండు గర్భిణీ, పుట్టిన పాప మృతి చెందిన సంఘటన అచ్చంపేట నియోజక వర్గంలో చోటు చేసుకుంది. అచ్చంపేట నియోజకవర్గం పదర మండలం వంకేశ్వరం గ్రామానికి చెందిన నిండు గర్భిణీ స్వర్ణ (23) ప్రసవం కోసం ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా పరిస్థితి విషమించడం వల్ల అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలోని ప్రభు త్వాసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యు లు నిరాకరించి నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. 3 ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో గర్భిణీ పరిస్థితి మరింత విషమంగా మారింది. డాక్టర్ల నిర్లక్ష్యం కారణంగానే అచ్చం పేట నుంచి నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రానికి సోమవారం అర్ధరాత్రి సు మారు 12 గంటల సమయంలో 108 ద్వారా తరలించారు. అప్పటికే గర్భిణీ పరిస్థితి విషమంగా ఉండటాన్ని గమనించిన సిబ్బంది మెరుగైన వైద్య సేవల కోసం అర్ధరాత్రి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో చేసేదేమి లేక 180 కిలోమీటర్లు 108 ద్వారా గర్భిణీ స్వర్ణను పాలమూరుకు తీసుకెళ్లినప్పటికి ఆసుపత్రిలో స్వర్ణ మగబిడ్డకు జన్మనిచ్చి ఆమె తనువు చాలించింది. స్వర్ణ మృతి చెందిన కొద్ధి సేపటికే పుట్టిన బిడ్డ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. ఈ సంఘటనకు స్థానికంగా మెరుగైన వైద్య సేవలు లేకపోవడం, వైద్యులు అందుబాటులో ఉండకపోవడమే కారణమంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వాసుపత్రులే ప్రాణాలకు గండంగా మారుతున్నాయి...

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలను అందించి ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తామంటున్న ప్రభుత్వాలకు అచ్చంపేట నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న దారుణాలు కనిపించడం లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలోనే మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన అచ్చంపేట నల్లమల్ల ప్రాంతంలో ఆదివాసులు, చెంచులు, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలే ఎక్కువగా ఉంటారు. ఈ ప్రాంతంలో వైద్య సేవలు అందక ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో పురుడు పోయాలని, అందుకు సంబంధించి ఎన్నో పథకాలు అందించిన సకాలంలో గర్భిణీలు ఆసుపత్రులకు వచ్చిన వైద్యుల నిర్లక్ష్యంతో తల్లి బిడ్డలు పురుటిలోనే మృతి చెందుతున్న సంఘటనలు ఎన్నో.

## ధరణి పోర్టల్‌ను రద్దుచేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు బిజెపి నాయకుల ధర్నా

**గద్వాల టౌన్,డిసెంబరు 27 ప్రభాతవార్త:** ధరణి పోర్టల్‌ను రద్దు చేయాలని కోరుతూ మంగళవారం భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ధరణి పేరిట రైతులను రాష్ట్రంలో అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధరణి వలన గ్రామాలలో ఒకరి పేరు మీద ఉన్న భూమి ఇంకొకరి పేరుపై మార్పులు చోటు చేసుకుంటున్న సందర్బంగా కొట్లాటలకు ప్రభుత్వం ఆజ్యం పోసిందని దీనివలన సొంత భూములు ఉండి ప్రభుత్వ రికార్డులలో పేరు లేకపోవడం వలన ఆఫీసుల్లో అధికారుల చుట్టు తిరిగి చివరకు పెట్రోల్ పోసుకుని రైతులు చనిపోతున్నారన్నారు. ఈ విధంగా అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులకు గురి చేసిన ఈ ప్రభుత్వం వెంటనే దానిని ఎత్తివేయాలని అన్నారు. కేవలం రైతుబంధు పేరు చెప్పి రైతులకు కేంద్ర ప్రభుత్వం తరపున వచ్చిన అన్ని రకాల పథకాల ఫసల్ భీమా పథకాన్ని రద్దుచేసి రైతులకు అన్ని విధాలా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్బంగా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రాష్ట్రంలో సుమారు 8 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడానికి కారణమయ్యారన్నారు. అదేవిదంగా హామీ ఇచ్చిన లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక్క రైతుకు రుణమాఫీ చేయలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గడ్డం కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డికె స్నిగ్ధారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రామాంజనేయులు, రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు బండల పద్మావతి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పాల్వాయి రాముడు, జిల్లా ఓబిసి మోర్చా అధ్యక్షుడు కబీర్‌దాస్, నరసింహ, జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు మిర్జాపురం వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కృష్ణవేణి, రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకటరాములు, కౌన్సిలర్లు రజక జయశ్రీ,కబీర్‌దాస్,అనిత, కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి, అన్ని మండల అధ్యక్షులు, రైతులు, బజెపి సీనియర్ నాయకులు పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు.

## వన్‌టైం సెటిల్మెంట్ పథకం ద్వారా రైతులు లబ్దిపొందండి

**అయిజ,డిసెంబరు 27 ప్రభాతవార్త :** సింగిల్ విండోలో దీర్ఘకాలిక రుణాలు తీసుకుని తిరిగి చెల్లించని రైతులకు అపరాధ రుసుము, గడువు దాటిన అప్పులపై వేసే వడ్డిని వన్‌టైం సెటిల్మెంట్ పథకం ద్వారా మాఫీతో మిగతా అసలు, వడ్డి చెల్లించి లబ్ది పొందవచ్చని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు పోతుల మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్బంగా మంగళవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఆవరణలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో 52 మంది రైతులు 29 లక్షల 30 వేల 670 రూపాయల దీర్ఘకాలిక రుణాల అసలుకు అపరాధ రుసుము వగైరా కలిపి ఒకకోటి నాలుగు లక్షల 8 వేల రూపాయలు చెల్లించాల్సి ఉందని అన్నారు. ఈ అసలు రుణాలకు అపరాధ రుసుము అలాగే గడువు మీరిన అనంతరం చెల్లించే అప్పుపై వేసే వడ్డిలో వారు తీసుకున్న రుణంపై ఉన్న గడువు ఆధారంగా అపరాధ రుసుమును పూర్తిగా మాఫీ చేస్తూ, గడువు మీరిన అప్పుపై వేసే ఇంట్రెస్ట్‌ను 20 నుండి 50 శాతం దాకా మాఫీ చేస్తూ డిసిసి బ్యాంక్ వన్‌టైం సెటిల్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఆయన అన్నారు. ఈ గడువు వచ్చే జనవరి 31వ తేదీ వరకు ఉంటుందని దీనిని దీర్ఘకాలిక అప్పులు ఉన్న రైతులు వెంటనే చెల్లించి లబ్ది పొందాలని ఆయన సూచించారు. ఇందులో భాగంగానే మండల పరిధిలోని దేవకొండ గ్రామానికి చెందిన బోయ చిన్నతిమ్మప్ప వన్‌టైం సెగ్మెంట్లో భాగంగా ఆయన రుణాన్ని వన్‌టైం సెటిల్మెంట్‌లో పోగా మిగతా రుణాన్ని చెల్లించి లబ్దిపొందారు.ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరైతు వినియోగించుకుని లబ్ది పొందాలనివిండోఛైర్మన్‌రైతులనుకోరారు.సమావేశంలోపిఎసిఎస్‌సిఇఓమల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## సాతర్లలో ప్రభుత్వం ఇచ్చిన ఇండ్ల స్థలాలపై లబ్ధిదారులను బెదిరిస్తున్న దౌర్జన్యకారులు

### కలెక్టర్, తహసిల్దార్‌కు లబ్దిదారులు ఫిర్యాదు

**ఇటిక్యాల,డిసెంబరు 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సాతర్ల గ్రామంలో సర్వే నంబర్ 3 లో 1985వ సంవత్సరంలో గ్రామంలోని నిరుపేదలకు 62 మందికి ఇళ్లస్థలాల కోసం పట్టాలను అప్పటి ప్రభుత్వం పంపిణీ చేసింది. అయితే ఈ భూమి మాది ఇక్కడి నుండి వెళ్లిపోవాలని అదే గ్రామానికి చెందిన దామోదర్‌రెడ్డి, భీమిరెడ్డి అనేవ్యక్తులు అక్కడికి వచ్చి నిత్యం భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ మంగళవారం పట్టాలు పొందిన లబ్దిదారులు జిల్లా కలెక్టర్, ఇటిక్యాల తహసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 1985 సంవత్సరంలో ఇచ్చిన ప్లాట్లలో ఇప్పటికే గుడిసెలు, ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నామని కాని దామోదర్‌రెడ్డి, భీమిరెడ్డి అనే వ్యక్తులు ఈ భూమి మాది మీది కాదు అంటూ పదిరోజుల క్రితం అక్కడికి వచ్చి మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండల డిప్యూటి తహసిల్దార్ నందినికి రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం ఇండ్ల స్థలాల కోసం ఇచ్చిన భూమిలో ఈ భూమి ప్రభుత్వానికి సంబంధించిందని నోటీసు బోర్డు ఏర్పాటు చేసి దౌర్జన్యకారుల నుండి మమ్మల్ని రక్షించాలని కలెక్టర్, తహసిల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో ఇండ్ల స్థలాలు పొందిన లబ్దిదారులు వేడుకున్నారు.

## డాక్టర్ కపిలవాయి లింగమూర్తి అవార్డు గ్రహీత యెన్నం రుక్మాంగధరెడ్డికి ఆత్మీయ సన్మానం

**వెల్దండ, డిసెంబర్27, ప్రభాతవార్త:** కవి, రచయిత, విమర్శకుడు, ఉపన్యాసకులు, రిటైర్డు అధ్యాపకులు యెన్నం రుక్మాంగధరెడ్డి హైదరాబాద్‌లో రవీంద్ర భారతి ఆడిటోరియంలో డాక్టర్ కపిలవాయి లింగమూర్తి సాహిత్య అవార్డు పొందిన సందర్బంగా వెల్దండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల సమక్షంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి ప్రాంతంలో ఎంతో మంది విద్యార్థులకు విద్య, విజ్ఞానము, క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందించి విద్యార్థుల్లో కవిత్వ భావజాలాన్ని నింపి తెలుగు భాష అభివృద్ధికి రుక్మాంగధరెడ్డి కృషి చేశారని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి, రిటైర్డు అధ్యాపకులు బాలయ్య, తెలంగాణ ఉద్యమకారులు కానుగుల జంగయ్య, జేపీసీ చైర్మన్ సదానందంగౌడ్, కళాశాల అధ్యాపకులు విజయలక్ష్మి, భరత్, లక్ష్మికాంత్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## ఆంజనేయస్వామికి అభిషేకం

**దేవరకద్ర,డిసెంబరు27 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం చిన్న రాజమూరులోని శ్రీ ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సాంప్రదాయ రీతిలో వివిధ అర్చనలతో పాటు పూజలు నిర్వహించారు. పూజ సందర్బంగా స్వామివారి మూల విగ్రహాన్ని రకరకాల పూలతోపాటు వివిధ రకాల ఆభరణాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్ గోపాలచారి, ఈఓ ప్రసాద్‌తో పాటు దేవస్థానం పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏర్పాటు

**కొత్తకోట,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** ఉమ్మడి మండలాల విశ్రాంతి ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభాధ్యక్షులుగా వెంగళ్ రెడ్డి నిర్వహించగా అధ్యక్షులుగా కె.రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మయ్య, వెంకటయ్య, కమలమ్మ, ప్రధాన కార్యదర్శిగా మాదన్న, కోశాధికారి ఎం.రవీందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రామకృష్ణ, ప్రచార కార్యదర్శిగా ఎండి హనిష్, గౌరవ అధ్యక్షులుగా సిరాజుద్దీన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన అధ్యక్షులను రవీందర్ రెడ్డి ని మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ వెంకటనారాయణ ఘనంగా సత్కరించారు.

# స్వామియే శరణం అయ్యప్ప

### జడ్చర్లలో మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

### భక్తిశ్రద్ధలతో ఆభరణాల ఊరేగింపు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, డిసెంబర్27ప్రభాతవార్త:** జడ్చర్ల మండల కేంద్రం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. స్వామివారి ఆభరణాలు ఊరేగింపు అత్యంత శోభాయమానంగా సాగింది. స్వాములు వందలాదిగా పాల్గొని భక్తి శ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. బాదేపల్లి రంజితబాబు ఇంటి నుంచి పాతబజార్, నేతాజీ చౌరస్తా మీదుగా కల్వకుర్తి రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం వరకు ఊరేగింపు సాగింది.పట్టణంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన స్వాములతో పట్టణమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది.







# లింగ వివక్ష లేని సమాజం నిర్మాణం కావాలి

### రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి





**ఖిల్లాఘణపురం,డిసెంబర్27 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గణిత ల్యాబ్ ను ప్రారంభించి గణిత సంబ రాల్లో పాల్గొన్నారు. ఈ సందర్బంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లా డుతూ దేశంలో లింగ వివక్ష లేని సమాజాన్ని నిర్మిస్తే దేశ అభివృద్ధి వేగవంతం అవుతుందని అన్నారు. ప్రస్తుత తరుణంలో సమాజంలో ఆడబిడ్డలకు ప్రాతినిత్యం పెరిగిందని ఆకాంక్షించారు. గతంలో ఆడ బిడ్డలు ఉన్నత చదువులకు దూరంగా ఉండేవారని గుర్తు చేశారు. బాలి కల ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాలకు ఎదగడానికి నిరం తరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి విద్యార్థిని యుక్త వయసులో పని చేయడాన్ని గౌరవంగా భావించడం అలవాటు చేసుకోవాలని అన్నారు. ప్రతి మనిషికి పని విలువ తెలినప్పుడే మనుషుల విలువ తెలుస్తుందని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి రోజువారీ ఇంటి పనులనే కాకుండా వారాంతంలో ఇతర పనులు వెతుక్కుని మరీ చేయాలని ఆకాంక్షించారు. కష్టం చేయడం ద్వారా సాధించే వారి మాట చెల్లుబాటు అయ్యేలా పరిస్థితులు మారాలని ఆకాంక్షించారు. యూరప్, అమెరికా లాంటి దేశాల్లో అందరికి సమాన హక్కులు ఉంటాయని సమాన గౌరవం లభిస్తుందని తెలిపారు. సమీప భవిష్యత్‌లో భారత దేశంలోనూ లింగ వివక్ష లేని సమాజం నిర్మాణం కావాలని అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు ఇతర గ్రామాల నుండి చదువుకోవడానికి వస్తున్న 9,10వ తరగతుల విద్యార్థినిలకు తన కూతుళ్ల వేతనంలోంచి సొంత ఖర్చులతో సైకిళ్ల పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల గణిత ల్యాబ్ ఏర్పాటుకు కృసి చేసిన ఉపాధ్యాయులు శోభారాణి, శారద ల కృషి ని అభినందించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు గణిత వాస్త్రంలో చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం గణిత శాస్త్రంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు షీల్డు, ప్రశంసాపత్రాలను మంత్రి అ ందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఉషారాణి, డిప్యూటీ ఇంజనీర్ సత్యనారాయణఎంపీపీ కృష్ణా నాయక్, జడ్పీటీసీ సామ్యా నాయక్, పీఏసీఎస్ చైర్మెన్ మురళీధర్ రెడ్డి, మాజీ వనపర్తి వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ లక్ష్మారెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మెన్ బాలీశ్వర్ రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ క్యామరాజు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సత్యనారాయణ, శ్యాంసుందర్ రెడ్డి, టీఆర్ఎస్‌కెవి జిల్లా అధ్యక్షులు విక్రం, సర్పంచులు వెంకటరమణ, శాంతమ్మ, గిరిమ్మ వెంకటేష్, నిర్మలాసుదర్శనాచారి, అరుణాదేవి సురేందర్, దేవేందర్, పద్మ శ్రీ బాలీశ్వర్ రెడ్డి, పీనా నాయక్, శేషయ్య, సతీష్, మోహన్ జీ, నరేష్ నాయక్, శ్రీను నాయక్, బాలస్వామి, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధరణి పోర్టల్ ఎత్తివేసే వరకు బీజేపీ పోరాటం చేస్తుంది

### బీజేపీ జిల్లా ప్రదాన కార్యదర్శి డి.నారాయణ



**వనపర్తి టౌన్,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎంపీ బండి సంజయ్ కుమార్ పిలుపు మేరకు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.నారాయణ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ చౌక్‌లో రైతు ధర్నా నిర్వహించారు. రైతు ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ 2018 ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని రైతాంగానికి లక్షరూపాయల రుణమాఫీ ఒకేసారి చేస్తానని హామీ ఇచ్చి రాష్ట్ర రైతాంగ ఓట్లతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి కేసీఆర్ రుణమాఫీ విషయాన్ని అటకెక్కించాడని, ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరం తరువాత కేవలం రూ.25వేల రుణం తీసుకున్న వారికి మాత్రమే రుణమాఫీ వర్తింపజేసి రూ.25వేల కన్నా ఎక్కువ ఉన్న రుణాలను మాఫీ చేయకుండా రైతులను నిండా ముంచాడని విరమర్శించారు. రాష్ట్రంలో లక్షలాది మంది ప్రజలు ధరణి పోర్టల్ వైఫల్యాల వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారని ధరణి పోర్టల్ ను ప్రక్షాళణ చేసి రాష్ట్రంలోని ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ధరణి పోర్టల్ ద్వారా అనేక ఏళ్లుగా తమ భూములను సాగుబడి చేస్తున్న రైతులు కంప్యూటర్లో జరిగిన తప్పిదాలకు పార్ట్ బీ లో పెట్టడం వల్ల యాజమాన హక్కులను కోల్పోతున్నారని ప్రదానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతాంగానికి పెట్టుబడి వ్యయం, రైతు బంధు ఏవి కూడా అందడం లేదని ప్రభుత్వ తప్పిదాలకు లక్షలాది మంది ప్రజలు ఆవేదన చెంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం ధరణిని సమీక్షించి వెంటనే ప్రక్షాళన చేయకపోతే బీజేపీ పెద్దఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల రైతాంగానికి పక్షపాతి అయిన భారతీయ జనతా పార్టీ రైతు వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని లక్ష రూపాయల రుణమాఫీ, ధరణి పోర్టల్ ప్రక్షాళన, ఫసల్ భీమా యోజన అమలు, ఉచిత ఎరువుల సరఫరా చేసే వరకు బీజేపీ నిద్రపోదని రానున్న రోజుల్లో రైతుల మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వాన్ని దించే వరకు పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతు ధర్నా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి వెంకటన రెడ్డి, కృష్ణ, ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి బి.శ్రీశైలం, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ జింకల కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు డి.నారాయణ, ఎ.రామన్‌గౌడ్, కె.మాధవరెడ్డి, సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేతూరి బుడ్డన్న, జిల్లా ఉపాధ్యక్షులు సుమిత్రమ్మ, బండారు కుమారస్వామి, ఎ.సీతారాములు, రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మీడియా ఇన్చార్జ్ పెద్దిరాజు, కార్యదర్శులు చిత్తారి ప్రభాకర్, ఎం.చెన్నయ్య, కె.శివారెడ్డి, ఎస్సీ మోర్చ రాష్ట్ర నాయకులు సాయిరాం, అధికార ప్రతినిధులు బుచ్చిబాబు గౌడ్, మనివర్ధన్, శ్రీనివాస్ రెడికడ, సంతోష్ యాదవ్, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రామ్ రెడ్డి, జిల్లా మోర్చాల అధ్యక్షులు కల్పన, బి.అనుజ్ఞ రెడ్డి, ఆగపోగు కుమార్, రాఘవేంద్ర గౌడ్, పట్టణ అధ్యక్షులు బి.రామ్మోహన్, యువ మోర్చ నాయకులు కదిరే మధు, రాజశేఖర్ గౌడ్, ఎ.రాజు అరవింద్, శివ కుమార్, ఐటీ సెల్ కన్వీనర్ విజయసాగర్, పట్టణ ప్రధాన కార్యదర్శి మామిళ్లపల్లి రాయన్న, సూగూరు రాములు, కంటెస్టెంట్ కౌన్సిలర్ మధుసూధన్ రెడ్డి, నందిమల్ల రవి, లక్ష్మీనారాయణ, మండలాల అధ్యక్షులు భగవంతు యాదవ్, రమేష్, వెంకటస్వామి నవీన్ రెడ్డి, అరవింద్ రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, జిల్లా నాయకులు రాఘవేందర్, ఆంజనేయులు, ఓం ప్రకాష్ చారి, బొడ్డుపల్లి వెంకట్, ద్వారపోగు సుబ్రమణ్యం, జ్ఞానేశ్వర్ గోవిందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## జనవరి 3వ తేదీన మండల స్థాయి టీఎల్ఎమ్ మేళా..



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

**పెద్దమందడి,డిసెంబర్27 ప్రభాతవార్త:** మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెడ్ మాస్టర్స్ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. సమావేశంలో జనవరి 3వ తేదీ నా మండల స్థాయిలో టీఎల్ఎమ్ మేళా నిర్వహించాలని నిర్ణయిస్తూ ఇందుకు ప్రతి పాఠశాల నుండి 4సబ్జెక్టులు అనగా తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానం పై 4 ఎక్సిబిట్స్ కు తగ్గకుండా తీసుకురావాలని హెడ్ మాస్టర్స్ కు సూచిస్తూ మండల మేళాను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ స్థానిక ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, మద్దిగట్ల, మోజర్ల కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ఈశ్వరాచారి,శ్రీనివాసులు, జిల్లాడీఎస్ఓ, వివిధపాఠశాలలహెడ్ మాస్టర్స్ పాల్గొన్నారు.

## అల్వాల గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేసిన డీఎల్పీఓ



**పెద్దమందడి,డిసెంబరు 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్వాల గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ రికార్డులను డిఎల్పీఓ రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. అదేవిధంగా నర్సరీ పల్లె ప్రగతి, ప్రకృతివనం గ్రామాలలో పర్యటించి గ్రామ డ్రైనేజీ కాలువలను, పరిశుభ్రతపై తనిఖీ చేశారు. ఈ సందర్బంగా డీఎల్పీఓ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రంగా ఉంటే గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. గ్రామం పరిశుభ్రతపై చాలా చక్కగా చర్యలు పరిశుభ్రంగా ఉన్నందుకు ఆయన గ్రామాలు పరిశుభ్రంగా ఇలా ఉంచాలని అన్నారు నర్సరీలో త్వరలోనే మొక్కల ఏర్పాటు, పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలో ఎప్పటికప్పుడు గ్రామంలో చేసే పనులు రికార్డులు నమోదు చేయాలని అన్నారు. గ్రామాల అభివృద్ధి, ఉపాధి హామీ పథకం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామాల అభివృద్ధి బాధ్యత ఉండాలని అన్నారు. గ్రామ అభివృద్ధికి అందరు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సువర్ణ జగన్మోహన్‌రెడ్డి,పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## గౌడసంఘం భవన నిర్మాణానికి మంత్రికి విజ్ఞప్తి



**వనపర్తి ప్రతినిధి,డిసెంబరు 27 ప్రభాతవార్త:** జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో మంత్రి క్యాంపు కార్యా లయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని మున్సిపల్ ఛైర్మన్ గట్టు యాదవ్, మార్కె ట్ కమిటి ఛైర్మన్ పలుస రమేష్ గౌడ్, వనపర్తి జిల్లా గౌడ సంఘం, జిల్లా జడ్పీ వైస్ ఛైర్మన్, గుండ్రాతి వామన్‌గౌడ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా కేంద్రంలో బహుజన చక్రవర్తి విప్లవ వీరుడు పేదల అభివృద్ధికి కృషి చేసిన సర్వార్ సర్వాయి పాపన్న మహరాజ్ విగ్రహం ఏర్పాటు చేయా లని, జిల్లా కేంద్రంలో గౌడ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని మంత్రిని కలిసి విన్న వించారు. ఈ సందర్బంగా మంత్రి భవన నిర్మాణానికి స్థలం కేటాయింపులో వారికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్బంగా మంత్రికి వారు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లాగౌడ సంఘం అధ్య క్షుడు పలుస శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, ఉపాధ్యక్షులు నాగవర వెంకటేష్‌గౌడ్, సంగమేశ్వ ర్‌గౌడ్, అమరేందర్‌గౌడ్, రవిందర్‌గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, వనపర్తి జిల్లా జాయింట్ సెక్రెటరీ తిలకేశ్వర్‌గౌడ్, గోపాల్‌పేట మండల అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, పెబ్బేరు మండల అధ్యక్షుడు సుగురు రాజశేఖర్‌గౌడ్, ఆత్మకూర్ మండల అధ్యక్షుడు తిరుపతయ్యగౌడ్,ఘనపూర్ మండల అధ్యక్షుడు ఆంజనే యులుగౌడ్, ఆత్మకూర్ గౌడ పెద్దలు చంద్రగౌడ్, ఆనంద్‌గౌడ్, ఆత్మకూర్ మండల ప్రధాన కార్యదర్శి వెంక టేష్‌గౌడ్, ఘనపూర్ మండల గౌరవ అధ్యక్షులు మన్యంగౌడ్, సలహాదారులుకృష్ణయ్యగౌడ్,జిల్లా మీడియా కన్వీనర్ పురెందర్‌గౌడ్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ నరెందర్‌గౌడ్, జిల్లాజాయింట్‌సెక్రెటరీ రాజేష్‌గౌడ్,వనపర్తి పట్టణ మీడియా కన్వీనర్ శివగౌడ్, గోపాల్‌పేట మండల ప్రధానకార్యదర్శి లచ్చగౌడ్, వనపర్తి జిల్లా యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ శివప్రసాద్‌గౌడ్‌లు ఉన్నారు.

## వాసవీమాత సేవా సమితి క్యాలెండర్ విడుదల

**వనపర్తి టౌన్,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వాసవీమాత క్యాలెండర్ ను వనపర్తి జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష విడుదల చేశారు. వాసవిమాత సేవా సమితీ జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ శెట్టి తయారు చేయించిన క్యాలెండర్ ను విడుదల చేసి ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత కరోనా కాలంలో శ్రీవాసవి సేవా సమితి ద్వారా నిత్యవసర సరుకుల పంపిణీ, ఆనందయ్య మందు పంపిణీ, మాస్కుల పంపిణీ, పాఠశాలలకు విద్యార్తులకు సంబందించిన మెటీరియల్ ను పంపిణీ చేయడం జరిగిందని వారు ఇకముందు ఇంకా మంచి సేవా కార్యక్రమాలు చేయాలని వాసవి సేవా సమితి సభ్యులకు అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాను, నాగేందర్, మారం గోవిందు, షేక్ అత్తర్, తదితరులు పాల్గొన్నారు.

## గోదా అమ్మవారికి శారీ సమర్పణ

**కొత్తకోట,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** ధరూర్‌మాస సందర్భంగా చిన్నజీయర్ స్వామి ఆశ్రమంలో మంగళవారం గోదా అమ్మవారికి బీఆర్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వికాస తరగతుల అధ్యక్షురాలు భీమా ప్రసన్న లక్ష్మీ సమర్పించారు. ఈ సందర్బంగా ఆశ్రమ చిన్నజీయర్ స్వామి భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ ధనుర్ మాసాన్ని పురస్కరించుకొని ఇలాంటి కార్యక్రమాలు చేయడం హర్షించదగ్గ విషయమని ప్రతి హైందవ మహిళలు ఇలాంటి కార్యక్రమం చేయడం పుణ్యఫలం దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో భీమా విజయ లక్ష్మీ, అర్దం విజయలక్ష్మీ, భీమా కళ్యాణి, రజిని, మెడిశెట్టి జ్యోతి, పెండ్యాల నరస్వతి, వికాస తరంగిని సబ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన కూనం సాంబశివరావు

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 27 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని చిన్నోనిపల్లి రిజర్వాయర్ సందర్శనకు వచ్చిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మంగళవారం ఐదుగ్రామాల భూ నిర్వాసిత రైతులు 334 రోజులుగా చేస్తున్న పోరాటానికి పూర్తి మద్దతు తెలిపారు. ఒక్క ఎకరాకు 100 మంది బతకవచ్చని అలా 2500ల ఎకరాలు పోతే రెండు లక్షల 50 వేల జనాభా జీవనం ఉపాధి కోల్పోతారని అన్నారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్‌ను సందర్శించి అక్కడ భూనిర్వాసితులు 334 రోజులుగా చేస్తున్న సమ్మె గురించి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్తానని ఈ రిజర్వాయర్ రద్దు చేసే విధంగా నా వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిపిఐ తెలంగాణ రాష్ట్రపార్టీ కార్యదర్శి కోణంనేని సాంబశివరావు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు, రైతులు సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి: ఎంపిపి

**బిజినేపల్లి,డిసెంబరు 27 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి తలపెట్టిన గుడ్‌మార్నింగ్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యేకు ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఇచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం ఆయా శాఖల అధికారులు, సల్కర్‌పేట, వసంతాపూర్, గుడ్లనర్వ గ్రామాల ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కార పురోగతిని తెలుసుకున్నారు. ఇప్పటి వరకు పరిష్కరించిన సమస్యల వివరాలను పరిష్కరించకపోవడానికి గల కారణాలు, ఇబ్బందులను తెలపాలని అధికారులకు తెలిపారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను నిజమైన అర్హులకు అందేలా ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసిల్దార్ అంజిరెడ్డి, ఎంపిడిఓ కృష్ణయ్య, ఎంపిఓ రాములనాయక్,విద్యుత్ శాఖ ఏఈ మాన్యనాయక్, సల్కరిపేట గ్రామ ఎంపిటిసి ఆంజనేయులు,నాయకులు రాములు,బుచ్చన్న,ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పెద్దదిన్నె వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఎంపి రాములుకు ఆహ్వానం

**ఇటిక్యాల,డిసెంబరు 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్దదిన్నె గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి జాతర బ్రహ్మోత్సవాల సందర్బంగా బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని మంగళవారం హైదరాబాదులోని ఎంపి క్యాంపు కార్యాలయంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు రాములును ఆలయ ధర్మకర్త జయసింహ, గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డిలు కలిసి ఆహ్వానించారు. ఈ నెల 31వ తేదీ నుండి జనవరి 5వ తేదీ వరకు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి జాతర బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు వారు ఎంపి రాములుకు వివరించారు.

## మన ఊరు మనబడి పనులను తక్షణమే పూర్తి చేయాలి

**ధరూర్,డిసెంబరు 27 ప్రభాతవార్త:** ధరూర్ మండల పరిధిలోని ఉప్పేరు, గుడ్డెందొడ్డి గ్రామాలను జడ్పీ సీఈఓ విజయనాయక్ మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా ఉప్పేరు, గుడ్డెందొడ్డి పాఠశాలలను సందర్శించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మనబడి కార్యక్రమం కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో పని చేయాలనే ఉదేశంతో ఈ కార్యక్రమం ప్రవేశపెట్టారు. అసంపూర్తిగా ఉన్న పనులను ఐదవ తారీఖు జనవరి నెల 23 కల్లా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ జబ్బార్, ఎంఈఓ సురేష్, గ్రామాల సర్పంచ్‌లు, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

## గువ్వల అమల సమక్షంలో టి(బి)ఆర్ఎస్ మహిళా కమిటీ ఎన్నిక

**లింగాల,డిసెంబరు 27 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో ఎమ్మెల్యే సతీమణి గువ్వల అమల సమక్షంలో మహిళా కమిటిని ఎన్నుకున్నారు. మహిళా అధ్యక్షురాలు తగిలి అలివేల, మరికొందరిని కమిటి సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్బంగా గువ్వల అమల మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు టి(బి)ఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు గ్రామస్థాయిలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోనేటి తిరుపతయ్య, టిఆర్ఎస్ జిల్లా నాయకులు కోటి తిరుపతయ్య, వసుమతి, మాజీ ఎంపిపి మంజుల, టిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు రానోజీ, టిఆర్ఎస్ నాయకులు మల్లేష్, ఎల్లేష్, శ్రీనివాసులు, పోల్ శ్రీనివాసులు, వీరస్వామి, మహిళలు పాల్గొన్నారు.

## నూతన నర్సరీలో మొక్కలు వేయడానికి వేగవంతంగా పనులు చేపట్టాలి

**పెద్దమందడి,డిసెంబరు 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెల్టూరు, గట్లఖానాపూర్‌లో మంగళవారం నర్సరీలలో ఎంపిడిఓ తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఎంపిడిఓ మాట్లాడుతూ నూతన నర్సరీలో వచ్చే ఏడాదికి హరితహారంలో భాగంగా మొక్కలు నాటడానికి త్వరలోనే నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల కోసం విత్తనాలు వేసి మొక్కలు ఏపుగా పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ అఫ్జల్ అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో త్వరలోనే నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచడానికి కృషి చేయాలని అన్నారు. వేసిన మొక్కలు త్వరలోనే వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. మొక్కలకు ప్రతిరోజు నీరు పోయాలని అన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటే గ్రామ ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏబీవీపీ ధర్నా

- పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలి - నిరుద్యోగ భృతి అందజేయాలి: ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ జగదీష్.

**ఖిల్లాఘణపురం,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** అచల భారతీయ విద్యార్థి పరిషత్ వనపర్తి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మండల ఏబీవీపీ శాఖ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కన్వీనర్ జగదీశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న రూ.2200కోట్ల స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వసతి గృహాల్లో తరుచుగా భోజనం ఫుడ్ పాయిజన్ అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ హాస్టల్లో నెలకొన్న సమస్యల పరిష్కారించాలని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందివ్వాలని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. 2200కోట్ల స్కాలర్‌షిప్ లను వెంటనే విడుదల చేయాలని అన్నారు. నిరుద్యోగ భృతి 3016 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జేఎల్, డీఎల్ పోస్టలను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్యోతి, బాలకృష్ణ, వంశీ, ఆనంద్, భవిత, మణిరామ్, తేజ, శివ తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్ ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

## జి20 శిఖరాగ్ర సదస్సుపై పీయూలో పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న అధ్యాపక బృందం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి,డిసెంబర్ 27,ప్రభాతవార్త:** రాష్ట్ర గవర్నర్, విశ్వ విద్యాలయ ఆదేశాల మేరకు జి20 శిఖరాగ్ర సమావేశాలకు 2023గానూ భారతదేశం వేదికకానన్న సందర్భంగా పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థులకు మంగళవారం వివిధ పోటీలు నిర్వహించారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఒకే భూమి, ఒకే భవిష్యత్తు, ఒకే కుటుంబం అనే అంశంపై వ్యాసరచన, ఉపన్యాసం, లోగో డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు.విశ్వవిద్యాలయ పరిధిలోని 170మంది విద్యార్థులు పాల్గొనగా ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త ప్రవీణ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ జి 20 సదస్సుపై అవగాహన పెంచుకొని భారతదేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎన్ అర్జున్‌కుమార్, ఈశ్వర్, చిన్నదేవి, స్వప్న, భారతి, హిమజ, స్వాతి పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్లను శుభ్రంగా చేస్తాం

### మున్సిపల్ చైర్‌పర్సన్ గాయిత్రి రవికుమార్ యాదవ్



**అమరచింత,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** ఆత్మకూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని గాంధీచౌక్ వ్యాపారస్థులు ప్రయాణికులు దుమ్ము, ధూళీ వల్ల ఇబ్బందులు పడకుండా రూ.5లక్షల నిధులతో సీసీ రోడ్లు వేస్తామని ఆత్మకూర్ చైర్‌పర్సన్ గాయిత్రి రవి కుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం గాంధీ చౌక్ ను పరిశీలించారు. ప్రజలకు, వ్యాపారస్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సీసీ రోడ్లు వేసే వరకు రోజు దుమ్ము లేకుండా నివారణ చర్యలు చేపడతామని వారు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మెన్ విజయ్‌భాస్కర్ రెడ్డి,మున్సిపల్ కమీషనర్ బీ.ఎన్.కె రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రవి కుమార్ యాదవ్ ఉన్నారు.

## నేడు మండల కేంద్రానికి మంత్రి రాక

**శ్రీరంగాపురం,డిసెంబర్27 ప్రభాతవార్త:** నేడు మండల పరిధిలోని జానంపేట, వెంకటాపురం, కంబలాపురం గ్రామాలలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పర్యటించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 2.30గంటలకు వెంకటాపురం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన, మధ్యాహ్నం 3గంటలకు వెంకటాపురం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన 3.30గంటలకు కంబలాపురంలో గ్రామ జ్యోతి కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం నూతన గ్రామ జ్యోతి కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం, నూతన గ్రామ పంచాయితీ శంకుస్థాపన చేయనున్నారు.కావున మండల స్థాయిలోవివిధ హక్షదాలో ఉన్న ప్రజా ప్రతినిధులు, సర్పంచులు,ఎంపీటీసీలు, పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని మంత్రి పర్యటన విజయవంతం చేయాలని మండల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

## వీర సముద్రం చెరువు సమస్యను తక్షణమే పరిష్కరించిన మంత్రి నిరంజన్ రెడ్డికి కృతజ్ఞతలు



చెరువు వెనకాల ఉన్న గుంత పంపు కాల్వను పరిశీలిస్తున్న సర్పంచ్ సత్యం యాదవ్, అధికారులు

**శ్రీరంగాపురం,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తాటిపాముల గ్రామం వీరసముద్రం చెరువు వెనకాల ఉన్న గుంతపంపు కాల్వ సమస్యను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి దృష్టికీ తీసుకెళ్లగా మంత్రి తక్షణమే స్పందించి సంబందిత అధికారులకు చెప్పడం జరిగింది. అధికారులు మంగళవారం డీఈ కిరణ్ కుమార్, ఏఈ దేవరాజ్, ఫీల్డ్ మీదికి వచ్చి సమస్యను పరిశీలించి త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని రైతులకు చెప్పడం జరిగింది. మంత్రి సమస్యపై తక్షణమే స్పందించి అధికారులను పంపించినందుకు రైతులు సంతషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటిపాముల గ్రామ సర్పంచ్ సత్యం యాదవ్, మాజీ సర్పంచ్ బజారయ్య, గొల్ల పెద్ద సాయిలు, బ్యారం కృష్ణయ్య, బండారు నాగన్న, బాలకిష్టి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ భవన గోదాం నిర్మాణ పనులను పరిశీలించిన నాబార్డ్ డీజీఎం

**కల్వకుర్తి, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పీఏసీఎస్ కార్యాలయాన్ని, ఊర్కొండ మండల కేంద్రంలో నాబార్డ్ నిధులతో నిర్మిస్తున్న 1500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామ్‌ను పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డితో మంగళవారం నాబార్డ్ డీజీఎం శ్రీనివాసులు పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. పీఏసీఎస్ బ్యాంక్ అభివృద్ధికి కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.



## 29న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

**అమరచింత,డిసెంబర్27 ప్రభాతవార్త:**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 3వ మహాసభల సందర్భంగా డిసెంబర్ 29వ తేదీ ఖమ్మం పట్టణంలో జరిగే భారీ బహిరంగ సభ జరుగుతుందని ఆ సభకు ముఖ్య అతిథులుగా కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరై విజయన్ తో పాటు అచలభారత స్థాయి నాయకులు వస్తున్నారని ఆ సభలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అమరచింత మండల పరిధిలోని పామిరెడ్డి పల్లె గ్రామంలో మంగళవారం మహాసభలకు సంబందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోనేరు రంగా రావు కమిషన్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం 10లక్షల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని వాటిల్లో ఎక్కువ భాగం ధనికులు పలుకుడి కలిగిన వారు ఆక్రమించుకున్నారని వాటన్నింటినీ వెలికి తీసి పేదలకు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదని ఆరోపించారు. గ్రామీణ పేదలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ముఖ్యంగా కూడు, గూడు, గుడ్డ, విద్య, వైద్యం వంటివి అందించకుండా వాటిని పేదలకు అందకూండా చేశారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ పూర్తిగా దాన్ని లేకుండా చేయాలనే కుట్ర పన్నుతుందని అన్నారు. సాగు భూములు, ఇండ్లు, ఇండ్ల స్థలిలు, ఉపాధి హామీ చట్టం, ప్రజా పంపిణీ వ్యవస్థ గురించి 3రోజులపాటు జరిగే ఈ మహాసభల్లో చిర్చించనున్నారని, ఈ మౌలిక సమస్యలను సాధించడం కోసం భవిష్యత్ కార్యాచరణను ఈ మహాసభలు రూపొందిస్తాయని 30, 31 తేదీల్లో ప్రతినిధుల సభ జరుగుతుందని దీనికి గాను రాష్ట్రంలోని 33జిల్లాల నుండి 600మంది ప్రతినిధులు ఈ మహాసభల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్ రాజు, బిల్ల నాగరాజు, చిన్న మల్లేష్, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

## ప్రజా పోరాటాలకు అండ ఎర్రజెండా: సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మల్లేష్

**అమరచింత,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** ప్రజా పోరాటాలకు ఎర్రజెండా అండ అని సమస్యల సాధనకు ఐక్యమై పోరాడుదామని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కొంకనవానిపల్లి గ్రామ శాఖ కార్యదర్శి మల్లేష్ పిలుపునిచ్చారు. సీపీ పార్టీ 98వ ఆవిర్భావ వేడుకలను అమరచింత మండలం కంకనోనిపల్లి గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కష్టజీవుల పక్షాన నిలబడేది ఎర్రజెండా ఒక్కటే అని అన్నారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు దక్కాలంటే పోరాటం తప్పదని అన్నారు. 8ఏళ్లయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. కేంద్రం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, ప్రతి రైతు ఖాతాలో 15 లక్షలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ బృతి, రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, దళితులకు 3ఎకరాల భూమి, పోడు భూములకు పట్టాలు ఎక్కడని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవీందర్, గ్రామపంచాయితీ 9,6 వార్డుల సభ్యులు బాలరాజు, ఆంజనేయులు, నాయకులు కృష్ణయ్య, శ్రీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ జెండావిష్కరణ చేస్తున్న సీపీఐ నాయకులు

## వికలాంగులకు సకాలంలో పెన్షన్లు అందించాలి..

**ఖిల్లాఘణపురం,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఎన్‌పీఆర్‌డీ ఇండియా సోషల్ మీడియా కన్వీనర్ రామకృష్ణ ఆధ్వర్యంలో వికలాంగులకు సకాలంలో పెన్షన్లు అందించాలని కోరుతూ మంగళవారం మండల తహసిల్దార్ భానుప్రకాష్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరం సర్టిఫికేట్ లేని వికలాంగలకు క్యాంపు ఏర్పాటు చేసి సదరం సర్టిఫికేట్ మంజూరు చేయాలని అన్నారు. వికలాంగుల బ్యాక్ లాక్ పోస్టులు ప్రతి సంవత్సరం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి వికలాంగుడికి 50కిలోల బియ్యం అందించాలని అంథోదయ కార్డులు మంజూరు చేయాలని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో 5%కోట కింద ఇల్లు కేటాయించాలని కోరారు. వికలాంగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని సమస్యల పరిష్కరానికి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ రామకృష్ణ, మండల ప్రెసిడెంట్ శ్రీను నాయక్, కురుమయ్య, రాజు, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు వరప్రధాయిని సీఎం రిలీఫ్ ఫండ్

**కల్వకుర్తి,డిసెంబర్ 27, ప్రభాతవార్త:** పేదలకు వరప్రధాయిని సీఎం రిలీఫ్ ఫండ్ అని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. పేద ప్రజలు కార్పొరేట్ స్థాయి వైద్యం పొందడానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో భరోసానిస్తుందని ఆయన తెలిపారు.కల్వకుర్తి పట్టణానికి చెందిన డీ.శ్రీకాంత్‌కు మంజూరైన రూ.60వేలు, ప్రగతికి మంజూరైన రూ.35వేలు, ఆమనగల్లుకు చెందిన జానయ్యకు మంజూరైన రూ.48వేలు, పాండుకు మంజూరైన రూ.60వేలు, తలకొండపల్లి మండలానికి చెందిన ఎల్లమ్మకు మంజూరైన రూ.16వేల సీఎం రిలీఫ్ ఫండ్‌లను బాధిత కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందారని, నిరుపేదలు ఎంతో ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ప్రాణాలతో జీవిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రమాదాల్లో గాయపడ్డవారు, అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు తదితరులు ఉన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

## ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దాపూర్ గ్రామంలో గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకునేందుకు ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గ్రామంలోని అన్ని కాలనీల్లో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా లేవా అని తెలుసుకునేందుకు గ్రామాల్లో పర్యటన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో అర్హులందరికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇస్తానని, రాబోయే రోజుల్లో గ్రామంలో విద్యుత్, డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్క రఘునందన్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

## పేద కుటుంబాలకు అండగా ధ్యాప నికిల్‌రెడ్డి

**ఊర్కొండ, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** మండలంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటూ... ఏ గడపలో ఆపద వచ్చిన నేనున్నానని భరోసానిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాధారం గ్రామ సర్పంచ్ ధ్యాప నికిల్‌రెడ్డి ముందుకొస్తున్నారని కాంగ్రెస్ అసెంబ్లీ సెక్రటరి షైబాజ్ పేర్కొన్నారు. మండలంలో ఎవరైన మృతి చెందిన, పేదింటి ఆడబిడ్డ వివాహాలైన, ఎవరైన ప్రమాదాల భారిన పడి చికిత్స పొందుతున్న వారందరిని ఆదుకుంటూ తన వంతు సహాయం అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఊర్కొండపేట గ్రామానికి చెందిన ఓర్సు వెంకటయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ధ్యాప నికిల్‌రెడ్డి మృతుడు ఓర్సు వెంకటయ్యకు ప్రగాఢ సంతాపం తెలిపి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని సమకూర్చగా... గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించి కాంగ్రెస్ పార్టీ తరుపున అండగా నిలుస్తా మన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రయ్య, అమీర్, ఆమెర్, మధు, శ్రీశైలం, షాకేర్, కైసర్, మాసూమ్, అరిఫ్, ఖాజా, మైబు, రియాజ్,మహమూద్, అల్తాఫ్, జహంగీర్ తదితరులు ఉన్నారు.



## కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విజయవంతం చేయండి

**శ్రీరంగాపురం,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు నేడు ఉదయం 10.30గంటలకు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి కాంగ్రెస్ పార్టీ 138వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరపాలని ఏఐసీసీ కార్యదర్శి డా.జి.చిన్నారెడ్డి డీసీసీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ ఆదేశించడం జరిగింది. కావున మండల కాంగ్రెస్ నాయకులు, రైతు కమిటీ నాయకులు, యువకులు పెద్దఎత్తున వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు.

## తక్షణమే రుణమాఫీ చేయాలి

### ధరణి ఇబ్బందులతో సతమతం

### మహబూబ్‌నగర్‌లో బీజేపీ రైతు ధర్నాలో పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరబహ్మ్రాచారి



**మహబూబ్‌నగర్ ప్రతినిధి,డిసెంబర్27,ప్రభాతవార్త:** లక్షలోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేయాలని, ధరణి వెబ్‌సైట్‌తో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వంరైతు వ్యతిరేఖ విధానాలను అవలంభిస్తున్నదన్నారు. రూ.లక్షలోపు ఉన్న రైతుల రుణాలను వెంటనే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి లక్షలోపు రుణాలు మాఫీ చేస్తామని మాటలతో మభ్యపెడుతున్నదన్నారు. రిజిస్ట్రేషన్ కోసం తీసుకొచ్చిన ధరణిలో చాలా లోపాలున్నాయని వాటిని ఆసరాగా చేసుకొని బీఆర్ఎస్ నేతలు ప్రజల ఆస్తులను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలోరాష్ట్ర కార్యదర్శి పద్మజారెడ్డి, మాజీ మంత్రి పీ చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు బురుజు రాజేందర్‌రెడ్డి, బీజేపీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి ఎగ్గనినర్సింహులు,పాండురంగారెడ్డి,న్యాయవాది ఎన్‌పీ వెంకటేశ్,పి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణవర్ధన్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి ఇతర నాయకులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి అండగా మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్



**కల్వకుర్తి, డిసెంబర్27, ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సిపాలిటిలో వాటర్ మెన్‌గా పనిచేస్తున్న బాబా భార్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. మృతురాలి కుటుంబాన్ని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించి మృతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో కౌన్సిలర్స్ గోరటి శ్రీనివాసులు, ఏజాస్, నాయకులు వెంకటేష్, సురేష్ ఉన్నారు.

## ఇంటి పన్నులను తగ్గించాలి

### -సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్27, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రాల్లో ఇంటి పన్నులు విపరీతంగా పెంచాలని, వాటిని వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్‌కు ఇంటి పన్నులు తగ్గించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ఇంటి పన్ను కంటే మూడు రెట్లు ఎక్కువగా పన్నులు పెంచారని, దీనితో సామాన్య, మధ్యతరగతి ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అనుమతుల ధరలు పెంచి సామాన్యులు ఇండ్లు కట్టుకునే పరిస్థితిల్లో లేరని, దానికి తోడు ఇంటి పన్నులు పెంచడం ప్రజానీకానికి పెను భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన ఇంటి పన్నులను వెంటనే తగ్గించకపోతే సీపీఎంఆధ్వర్యంలో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.ఆర్.శ్రీనివాసులు,మండల కార్యదర్శి అశోక్, నాయకులు రామయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేరవేరిన పెద్దాపూర్ గ్రామ ప్రజల కళ



గ్రామస్తులకు ప్రభుత్వం విడుదల చేసి జీవో కాపీని అందజేస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా వల్లభాన్‌పల్లి గ్రామ శివారులో నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దాపూర్ గ్రామానికి చెందిన రైతుల రెవెన్యూ భూభాగం గత కొన్నేళ్లుగా కొనసాగుతోంది. రెవెన్యూ భూభాగాన్ని వనపర్తి జిల్లాకు కాకుండా నాగర్‌కర్నూల్ జిల్లాకు మార్చాలని ఎమ్మెల్యేకు, అధికారులకు గ్రామస్తులు విన్నవించడంతో వల్లభాన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న రెవెన్యూ భూభాగం నాగర్‌కర్నూల్ జిల్లాకు కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. మంగళవారం ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పెద్దాపూర్ గ్రామరైతులను కలిసిప్రభుత్వం విడుదల చేసిజీవోకాపీని గ్రామస్తులకు అందించారు.దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కొనసాగుతున్న కోయిల్‌సాగర్ నీటిసరఫరా

**దేవరకద్ర,డిసెంబరు 27 ప్రభాతవార్త:** జిల్లాలోని భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నుండి మంగళవారం ఆయకట్టుకు కుడి,ఎడమ కాలువల ద్వార నీటిసరఫరా కొనసాగింది. ప్రాజెక్టులో నీటిమట్టం 31.6 ఫీట్లకు చేరింది. ఈ నెల 25న ప్రాజెక్టు నుండి ఆయకట్టుకు దేవరకద్ర, నారాయణపేట ఎమ్మెల్యేలు ఆలవెంకటేశ్వర్‌రెడ్డి,రాజేందర్‌రెడ్డిలు నీటిసరఫరాను ప్రారంభించిన విషయం విధితమే. ఈ నీటిసరఫరా దాదాపు 10 రోజుల పాటు ఏకధాటిగా కొనసాగుతుంది. అయితే ఆయకట్టుకు నీటిసరఫరా చేస్తుండటంతో ప్రాజెక్టు పరిదిలోని దేవరకద్ర, మరికల్, ధన్వాడ మండలాలకు చెందిన ఆయకట్టు రైతులు వ్యవసాయపనులు ప్రారంభించారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**దేవరకద్ర,డిసెంబరు 27 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం 10 కింటాళ్ళ సోనాధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ సోన ధాన్యానికి అత్యధికంగా రూ.2329 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.2319 ధర పలికింది. అలాగే 11 కింటాళ్ళ కందులను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. కింటాల్ కందులకు అత్యధికంగా రూ.6859 ధర పలికింది. అతితక్కువగా రూ.6700 ధర పలికింది. 6 కింటాళ్ళ ఆయుదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. అతిఎక్కువగా కింటాల్ ఆముదాలకు రూ.6351 ధర పలికింది. అతితక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## ఎమ్మెల్యే ఆల ఆధ్వర్యంలో పోలీస్ శాఖ, గ్రూప్ 2,3,4 ఉద్యోగాలకు ఇస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

### అడ్డాకుల జడ్పీటీసీ నందిమల్ల రాజశేఖర్‌రెడ్డి జనవరి 11నుండి శిక్షణ ప్రారంభం



**అడ్డాకుల,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకుల కోసం పోలీస్ మరియు గ్రూప్ 2,3,4 ఉద్యోగాల కోసం జనవరి 11 నుండి ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అడ్డాకుల నందిమల్ల రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే తండ్రి రఘుపతిరెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 2016 నుండి నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని రాష్ట్రంలోనే అనుభవజ్ఞులైన పీజేఆర్ కోచింగ్ సెంటర్ అధ్యాపకులచే శిక్షణ తో పాటు స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. జనవరి 10వ తేదీ లోపు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం అన్నసాగర్ లో దరఖాస్తు ఫారాలను తీసుకోని వివరాలు అందజేయాలని ఆయన సూచించారు.జనవరి 11నుండి శిక్షణ ప్రారంభం అవుతుందన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలోని అందరు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వివరాలకు 9347631272, 6305550396, 70931128808 నెంబర్ లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునని జడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి కోరారు.

## విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణ నిధులకు ఎమ్మెల్సీకి వినతి



ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

**వెల్దండ, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో నిర్మిస్తున్న విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు అన్నదానం కృష్ణయ్యచారి ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ భవన నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తున్నట్లు హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ నిధుల మంజూరు పట్ల విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు ఎమ్మెల్సీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో వెల్దండ అంజయ్యచారి, పాండురంగాచారి, జంగాచారి, వేణుగోపాలాచారి, వెంకటాచారి, రామాచారి, శ్రీశైలంచారి, ప్రసాద్‌చారి తదితరులు ఉన్నారు.

## సకాలంలో బిల్లులు చెల్లించాలి

### దుకాణదారులు ట్రేడ్ లైసెన్సుతీసుకోవాలి: జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, డిసెంబర్27ప్రభాతవార్త:** మున్సిపాలిటీ పరిధిలోని వినియోగదారులు సకాలంలో ఇంటి పన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ మహ్మద్ షేక్ కోరారు. జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంలో ట్రేడ్ లైసెన్సులు, ఇంటి పన్ను వసూళ్లపై బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ ప్రజలు ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలని, దుకాణదారులు ప్రతి ఒక్కరూ ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని కోరారు. మున్సిపాలిటీని అన్ని అంశాల్లో ముందుంచాలంటే ప్రజల సహకారం అవసరమని అందుకూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్వో శశిధర్, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

## క్రీడాకారుల క్రికెట్ కిట్ అందజేత

**వెల్దండ, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** క్రీడాకారులకు వెన్నంటే ఉండి అన్ని విధాలుగా అండగా ఉండి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ప్రోత్సహిస్తున్నారని ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండల పరిధిలోని బండోనిపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన యువకులకు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన క్రికెట్‌ను మంగళవారం వరప్రసాద్‌రెడ్డి అందించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడల ద్వారా శారీరక దేహదారుఢ్యం పెంపొందుతుందన్నారు.

**మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం:**



వెల్దండ మండల కేంద్రానికి చెందిన సాయి మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులను ఐక్యత ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి ఐక్యత ఫౌండే షన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేల ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ సభ్యులు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

## పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న సీఎం సహాయ నిధి



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** అనారోగ్య రీత్యా మెరుగైన వైద్యం పొందలేని వారికి సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం లింగసానిపల్లి గ్రామానికి చెందిన భీమయ్య తన బిడ్డ అనారోగ్యం గురించి ఆసుపత్రు ఖర్చుల నిమిత్తం రూ.1లక్ష ఎల్.ఓసీ చెక్కులను ఎంపీ పోతుగంటి రాములు క్యాంప్ ఆఫీస్‌లో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అపన్నహస్తంలా నిలిచిందన్నారు. వైద్యం పొంది ఆర్థిక ఇబ్బందులు కలుగకుండా పేద వారికి సీఎం సహాయ నిధి ఎంతో పారదర్శకంగా టీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో కల్వకుర్తి జెడ్పీటీసీ పోతుగంటి భరత్‌ప్రసాద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ కమిషన్ ఫైనాన్స్ చైర్మన్ ఇంతియాజ్‌ను కలిసిన కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్

**కల్వకుర్తి, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** మైనార్టీ కమిషన్ ఫైనాన్స్ చైర్మన్ ఇంతియాజ్‌ను మంగళవారం కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ కల్వకుర్తి పట్టణానికి సంబంధించిన మైనార్టీలకు కావాల్సిన లోన్ల విషయంలో మైనార్టీ కమీషన్ ఫైనాన్స్ చైర్మన్ సహకరించాలని కోరారు. అదే విధంగా పట్టణాభివృద్ధిపై చర్చించినట్లు తెలిపారు. మైనార్టీ లోన్ల విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని చైర్మన్ ఇంతియాజ్ పేర్కొన్నారు. మైనార్టీ కమీషన్ ఫైనాన్స్ చైర్మన్ ఇంతియాజ్‌ను కలిసిన వారిలో అంజద్, మక్బూల్, ఖాజా, నాసర్ ఖాన్, అయ్యూబ్ ఖాన్, ఏజాస్ తదితరులు ఉన్నారు.

## గర్భవతులకు కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

**ఇటిక్యాల,డిసెంబరు 27 ప్రభాతవార్త :** గర్భిణీ స్త్రీలలో వచ్చే రక్తహీనతను అరికట్టడానికి వారి పోషకాహార స్థాయిని మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వం కెసిఆర్ న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తుంది. అందులో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొండేరు, ఉదండాపురం, ఆరోగ్య ఉపకేంద్రాల నుండి 16 వారాల నుండి 26 వారాల గర్భవతులకు డాక్టర్లు సందీప్‌నాయక్, రమ్య ఆధ్వర్యంలో కెసిఆర్ న్యూట్రిషన్ కిట్లను 20 మంది గర్భవతులకు పంపిణీ చేశారు. ప్రాథమికఆరోగ్య కేంద్రంలో 2,3వ చెకప్‌లను డాక్టర్ల ద్వారా చూపించుకున్న గర్భవతులకు కెసిఆర్ న్యూట్రిషన్ కిట్లను అందజేయడం జరుగుతుందని డాక్టర్లు తెలిపారు. ఇందులో హార్లిక్స్, ఐరన్ సిరప్, ఖర్జూరం, నెయ్యి, ఆల్బెండజోల్ మాత్రలు ఉంటాయని వీటిని గర్భవతులు తినడం ద్వారా మంచిపోషకాహారం అందుతుందని డా.సందీప్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఈ‌ఓశేఖర్, సూపర్‌వైజర్లునాగమ్మ,వెంకటేశ్వర్లు,ఎఎన్ఎంలు,ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రోత్సాహకాలు



రివార్డులు,అవార్డులు తీసుకున్న సిబ్బందితో డీఎస్పీ

**మహబూబ్‌నగర్ బ్యూరో,డిసెంబరు 27 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నవంబర్ నెలలో విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి ప్రోత్సాహకాలు అందజేశారు. మంగళవారం నారాయణపేట జిల్లా పోలీస్ పరిదిలో పంక్షనల్ వర్టికల్ వారిగా విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి కెపిఐ రివార్డ్సును డీఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఫంక్షనల్ వర్టికల్స్ ఇంఛార్జి డిసిఆర్‌బి డీఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నారాయణపేట జిల్లా పరిధిలో పంక్షనల్ వర్టికల్ వారిగా (నవంబర్ మాసంలో) విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ప్రతిభ కనబర్చిన సిబ్బందిని అభినందించారు. ప్రతిభ కనబరిచే సిబ్బందిని, అధికారులను గుర్తించి ప్రతినెల (కెపిఐ రివార్డ్స్)లు అధికారులను సిబ్బందిని ప్రోత్సహించే విధంగా రివార్డులు, అవార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ప్రజల కోసం అంకితభావంతో విధులు నిర్వహించి ప్రజలకు ఎల్లవేళలా సేవలు అందించడానికి అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతిఒక్కరు ఫంక్షనల్ వర్టికల్ వారిగా పోటీపడి విధులు నిర్వహించి రివార్డులు ,అవార్డులు పొందాలని సూచించారు. కష్టపడి అంకితభావంతో విధులు నిర్వహించే వారికి డిపార్టుమెంట్‌లో ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. రివార్డులు, అవార్డులు అందుకోవడానికి అధికారులు పోటీపడి విధులు నిర్వహించాలని సూచించారు. ఏ అధికారి రికమండేషన్ లేకుండా ఆన్‌లైన్ డాటా నమోదు పరిచిన విధంగా సిసిటిఎన్ఎస్ అండ్ టిఎస్ కాప్ ఆధారంగా వారి పనితనాన్ని బట్టి పూర్తి పారదర్శకంగా రివార్డులు, అవార్డులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 20 మందికి కెపిఐ రివార్డులు అందజేయడం జరిగింది. అహర్నిశలు శ్రమిస్తూ ప్రజలకు పూర్తి రక్షణ పూర్తి భద్రత కల్పించుటకు వినూత్నమైన, సంస్థాగతమైన చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి వర్టికల్ వారిగా విధులు విభజించడంతో, వారి పని తీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించే ప్రయత్నం చేస్తున్నారు. అంతే కాకుండా వర్టికల్స్ టీమ్స్ పనితీరులో ప్రతిభ కనబర్చిన వారిని గుర్తించి వారిని ప్రోత్సహించుటకు, ప్రోత్సాహకాలను అందించడం జరుగుతుందన్నారు. పోలీస్ అధికారులు,సిబ్బంది మరింత బాధ్య తాయుతంగా ప్రజలకు సేవలు అందించాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ కె. సత్యనారాయణ, సిఐలు శ్రీకాంత్‌రెడ్డి, సీతయ్య, జనార్ధన్, డిపిఓ సూపరింటెండెంట్ శంకర్‌లాల్, ఎస్సైలు సురేష్, విక్రమ్, సుధామాధురి,సునిత,జిల్లామీద వర్టికల్స్‌లో ప్రతిభ కనబర్చిన పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







## మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని విజయం సాధించాలి

### లక్ష్యాన్ని చేరుకుంటేనే మాకు ఆత్మ సంతృప్తి

### ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి



అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

**గద్వాల టౌన్,డిసెంబరు 27 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని కెసిఆర్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు గ్రీన్ సంస్థవారి సహకారంతో ఎస్సై, కానిస్టేబుల్స్, గ్రూప్స్‌కు సంబంధించిన మెటీరియల్ పంపణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి హాజరయ్యారు. ఎమ్మెల్యే సతీమణి, గ్రీన్ సంస్థ అధినేతల చేతుల మీదుగా కెసిఆర్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన విద్యార్థినీ,విద్యార్థులకుఅందజేయడం జరిగింది. గ్రీన్ సంస్థ వారు మాట్లాడుతూ మా సంస్థ తరపున వివిధ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, ఎన్నోర కాలుగా సహాయం అందజేయడం జరిగిందన్నారు. కాని నేడు కెసి ఆర్ స్టడీ ద్వారా మెటీరియల్స్ అందించడంలో మాకు అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ మెటీరియల్ మా సంస్థ ద్వారా స్పాన్సర్ చేయడం వల్ల సంతోషంగా ఉందని తెలియజేశారు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి మాట్లాడుతూ కెసిఆర్ స్టడీ సర్కిల్‌ను ప్రారంభించి గత కొంతకాలంగా నిరుద్యోగ యువతీ, యువతకు ఉపాధి పొందేలా వారికి ఉచితంగా శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. గద్వాల ప్రాంతం ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో అక్షరాస్యతలతో వెనకబడి ఉంది. గతంలో ప్రతి ఒక్కరు గద్వాల అక్షరాస్యతలో వెనకబడి ఉందని హేళన చేసేవారని, వేలెత్తి చూపేవారని ఈ విషయాన్ని గ్రహించిన ఎమ్మెల్యే గద్వాల ప్రాంతం విద్యారంగంలో అభివృద్ధి చెందాలని సదుద్దేశంతో గద్వాల ప్రాంతంలోని విద్యార్థులకు చదువుకోవడానికి దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఒక స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఉద్దేశంతో గ్రామీణ ప్రాంతాలలోని యువతీ,యువతులు కూడా చదువుకోవాలన్నారు. భవిష్యత్తులో వారుకూడాఅత్యున్నత స్థాయికిఎదగాలని అప్పుడే గద్వాల విద్యాపరంగా అభివృద్ధి చెందుతుందని, అదేవిధంగా గద్వాల అన్ని రంగాల్లో కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కెసిఆర్ స్టడీ సర్కిల్ ద్వారా శిక్షణ పొందిన టెట్ ఫలితాలలో ఏ విధంగా సాధించారో అదేవిధంగా కానిస్టేబుల్స్,ఎస్సై ఈవెంట్స్‌లలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అదేవిధంగా మెయిన్స్‌లో కూడా మంచి ఫలితాలు సాధించే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. గ్రూప్‌కు సంబంధించిన పరీక్షల్లో కూడా కెసిఆర్ స్టడీ సర్కిల్ నుంచి ఎక్కువ మంది ఉత్తీర్ణులై ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని అన్నారు. ప్రతి ఒక్క యువతీ, యువకులు శిక్షణ తరగతులు అయిపోయాయని ఇంటి దగ్గర టివిలు,సినిమాలు, యాత్రలు అని వెళ్లకుండా ప్రతిరోజు 18గంటలు చదువుకుని త్వరలో జరగబోయే పరీక్షలలో ఖచ్చితంగా ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో, పట్టుదలతో కృషి చేయాలని మీ తల్లిదండ్రులకు, మీ ప్రాంతానికి, గద్వాలకు మంచిపేరు తీసుకుని రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాని తెలిపారు. కెసిఆర్ స్టడీ సర్కిల్ ద్వారా అందించే మెటీరియల్ సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో విజయంసాధించాలని కోరారు. అదేవిధంగా మీరు పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకుంటే అందరికంటే ఎక్కువగా సంతోషించేది మేమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి కెటిఆర్ యువసేన ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు మహబూబ్, భరత్‌రెడ్డి, నాయకులు ఎల్లప్ప, నిర్వాహకులు బిఎస్ రవి, విజయభాస్కర్ పాల్గొన్నారు.

## సామాజిక సేవలో ఆర్యవైశ్యుల పాత్ర ఎనలేనిది

### -నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

**వెల్దండ, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** సామాజిక సేవలో ఆర్యవైశ్యుల పాత్ర ఎనలేనిదని ఆర్యవైశ్య మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని బుధవార్‌పేట ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం 2023 క్యాలెండర్‌ను ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ అధ్యక్షతన ఆర్యవైశ్య బంధు మిత్రులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆర్యవైశ్యులు ప్రతి సందర్భంలో తమ సేవభావంతో ముందడుగు వేసి ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి మానవ సేవే.. మాధవసేవ పరమావాధిగా భావించి అనేక సేవా కార్యక్రమాల్లో తమ వంతు పాత్ర పోషించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అంతకు ముందు దేవాలయంలో ఆర్యవైశ్య బంధువులతో కలిసి బచ్చు రామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి వాస తిరుపతయ్య,ప్రచార కార్యదర్శి పూరి రమేష్, ఆర్యవైశ్యులు పూరి వజ్రలింగం, జులూరి బాలస్వామి, పస్పుల రాఘవేందర్, జగన్, జగదీశ్వర్, అరుణ్, అల్లంపల్లి కృష్ణ,ఉప్పు శ్రీనివాస్,శివకుమార్, బికుమాండ్ల శ్రీనివాస్, సంతు, రాఘవేందర్, పాండు, సత్యనారాయణ, అనిల్, తానేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## బాలానగర్ మండల టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

### ముఖ్య అతిథిగా హాజరైన కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్



టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ నూతన కమిటి

**రాజాపూర్,డిసెంబరు27 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం బాలానగర్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పినపాక ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగంలో ఉన్న మెకానిక్‌లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, మన కార్మికుల సంక్షేమం మన సంఘం నుండే అవుతుందన్నారు. ప్రతి మెకానిక్ సంఘంలో సభ్యులుగా చేరి ఐక్యంతో సమస్యల పరిష్కారానికి కలిసి రావాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మెకానిక్‌లను ఐక్యం చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో బాలానగర్ మండల టూ వీలర్ మెకానిక్స్ అసోసియషన్ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.నూతన అధ్యక్షుడిగా రమేష్‌నాయక్, ఉపాధ్యక్షులుగా రవిందర్, శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా సురెందర్, సహాయ కార్యదర్శిలుగా మల్లేష్, శ్రీకాంత్, కోశాధికారిగా వెంకటేష్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర సభ్యులు, షాద్‌నగర్ డివిజన్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్‌గౌడ్, భాస్కర్, లింగం, రాజేష్, బాలానగర్ మెకానిక్స్ జావేద్, అక్బహర్, అలింఖాన, రవి, మణికంఠ,శివగౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలలో నర్సరీల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం: డీఆర్డీఓ



నర్సరీలను పరిశీలిస్తున్న డీఆర్డీఓ

**అమరచింత,డిసెంబర్ 27 ప్రభాతవార్త:** ప్రభుత్వం గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహిస్తు చర్యలు తప్పవని వనపర్తి జిల్లా డీఆర్డీఓ నరసింహులు అధికారులను హెచ్చరించారు. మంగళవారం అమరచింత మండల పరిధిలోని నంది మల్ల ప్రియదర్శిని గ్రామాలలో నర్సరీని పల్లె ప్రకృతి వనం, బృహత్‌పల్లె ప్రకృతి వనం, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన పరిశీ లించారు. హరితహారం మొక్కలను పెంచడం అధికారులు ప్రజాప్రతినిధులు శ్రద్ద పెట్టాలని పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలను సంరక్షించాలని ఆయన అధికారులను కోరారు. అలాగే ఆయా గ్రామాలలో అధికారులు పర్యవేక్షణ చేసి గ్రామాల అభివృద్ధి పనులపై సమీక్షించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, ఏపీఓ బాలయ్య, ఈసీ రఘు, పీఎస్ రామాంజనేయులు ఆయాగ్రామాల సర్పంచులు విజయలక్ష్మీ, రామాలింగేశ్వరమ్మ, ఉన్నారు.

## ఆలిండియా పరుగు పందెం పోటీలకు విద్యార్థి ఎంపిక



**వెల్దండ, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** ఆలిండియా పరుగు పందెం పోటీలకు వెల్దండ మండల కేంద్రానికి చెందిన భీరయ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా భీరయ్య మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి 24 వరకు విజయవాడలో జరిగిన విశ్వవిద్యాలయ 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చినందున ఆలిండియా పరుగు పందెం పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఆలిండియా పరుగు పందెంలో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఆలిండియా పోటీలకు ఎంపికైన భీరయ్యను గ్రామస్తులు అభినందించారు.

## చెత్తను వేరు చేసి ఇవ్వాలి



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, డిసెంబర్27ప్రభాతవార్త:** తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని మున్సిపల్ కమిషనర్ నర్సింహులు సూచించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని 2వ వార్డు లక్ష్మీనగర్‌లో బ్రాండ్ స్వచ్ఛ్ బ్రాండ్ అంబాసిడర్ ప్రోగ్రాం పేరున మంగళవారం క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త వేరు చేయడం వల్ల కలిగే లాభాలపై స్థానికులకు వివరించారు. ప్రతి రోజూ చెత్తను వేరుచేసి సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఇండ్ల మధ్య చెత్తను వేయొద్దని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మున్సిపాలిటీ నుంచి అందజేసిన రెండు రకాల చెత్త బకెట్‌లో తడి,పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణికుమారి,గురులింగం వార్డు అధికారలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## యువకులకు క్రికెట్ కిట్ పంపిణీ

**కల్వకుర్తి, డిసెంబర్ 27, ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన రామాంజనేయ యూత్‌కు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి క్రికెట్ కిట్‌ను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని, అదే విధంగా క్రీడా కోటా క్రింద ఉద్యోగాలు కూడా పొందవచ్చునన్నారు. ప్రస్తుతం నగరాల్లోనే యువకులు క్రీడల్లో రాణిస్తున్నారని, వారి నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. కల్వకుర్తి ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి గుర్తింపు పొందాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, రామాంజనేయ యూత్ సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

